కనుమరుగవుతున్న పగటి వేషాలు

దసరాలో అంతరించిపోతున్న అరుదైన కళ

ద్వారకాతిరుమల: గతంలో దసరా పండుగ వస్తే చాలు, గ్రామ వీధుల్లో పగటి వేషగాళ్లు సందడి చేసేవారు. దసరాకు నెల రోజుల ముందే సంచార కళాకారులు విచిత్ర వేషధారణలతో ఇంటింటికీ వెళ్లి తమ హావభావాలతో అలరిస్తూ ఆకట్టుకునేవారు. శక్తి, వీర భేతాళ, గంగిరెద్దులు, అర్ధనారీశ్వర, బుడబుక్కల, పిట్టల దొర ఇలా పలు వేషాలతో కళాకారులు అభినయం ప్రదర్శించేవారు. కొందరు పద్యాలు, వ్యంగ్యాలు, హాస్యంతో పరవసింపజేసేవారు. ప్రజల నుంచి బియ్యం, డబ్బులను సంభావనలుగా అందుకునేవారు. ఇదంతా ఒక సంప్రదాయ పద్ధతిలో జరిగేది. అయితే ప్రస్తుత ఆధునిక సమాజంలో ఈ సంప్రదాయం కనుమరుగవుతోంది. ఒకప్పుడు వీధుల్లో పగటి వేషాలు వేసే కళాకారులు పదుల సంఖ్యలో కనిపించేవారు. ఇప్పుడు అక్కడక్కడా ఒకరో, ఇద్దరో కనిపిస్తున్నారు. పగటి వేషాలను గతంలో సంప్రదాయ కళగా, వేషాలు వేసేవారిని కళాకారులుగా ఆదరించే వారు. ఇప్పుడు కేవలం వారిని డబ్బులు ఆశించే బిక్షగాళ్లుగా భావిస్తున్నారు. క్రమేణా పగటి వేషాలు తగ్గుతున్నాయి. ఇప్పుడు దసరా పండుగకు కొన్ని గ్రామాల్లో చూద్దామన్నా పగటి వేషాలు కనిపించడం లేదు. ద్వారకాతిరుమల మండలం గొల్లగూడెంలో మాత్రం పగటి వేషగాళ్లు ఇంటింటికి తిరుగుతూ సందడి చేస్తున్నారు.

శాతవాహనుల కాలం నుంచి

పగటి వేషాలు, జానపద కళా రూపంగా శాతవాహనుల కాలం నుంచి ఉన్నాయని హాలుని గాథా సప్తశతి, భరత కోశం వంటి గ్రంథాలు తెలియజేస్తున్నాయి. పగటి పూట ప్రదర్శనల వలన వీటికి పగటి వేషాలుగా పేరొచ్చింది. కాకతీయుల కాలంలో యుగంధరుడు పిచ్చి యుగంధరుడిగా వేషం ధరించి శత్రువులను జయించిన కథలు ఈ కళ చారిత్రక ప్రాముఖ్యతను వివరిస్తున్నాయి. ఏపీలోని గడ్డిపాడు, కూచిపూడి వంటి ప్రాంతాలు 60 రకాల వేషాలతో ప్రసిద్ధి చెందాయి. ఇవి పౌరాణికం, హాస్య, నిత్య జీవిత కథలను ప్రదర్శించాయి. రాజు కళింగ గంగు, సంబెట గురవరాజు వంటి కథలు పండుగల్లో సామాజిక సందేశాలను అందించాయి.



గొల్లగూడెంలో రాక్షసి వేషంలో కళాకారుడు

గడపగడపను రంగస్థలం చేశాయి

దసరాలో శక్తి వేషం చాలా ముఖ్యమైంది. ఈ వేషాన్ని చూసి పిల్లలు భయపడేవారు. డప్పుల వాయిద్యాల నడుమ శక్తి పరుగులు తీస్తుంటే ప్రజలు భయపడి తలుపులు వేసుకునేవారు. అర్ధనారీశ్వర వేషం మరో ప్రత్యేక ఆకర్షణగా నిలిచేది. ఒకే వ్యక్తి శివుడు, పార్వతిగా ప్రదర్శన ఇచ్చేవాడు. ఈ వేషాలు వీధులు, ఇంటి గడపలను రంగస్థలాలుగా మార్చాయి. సమాజంలోని కుల, మత విమర్శలను కళాకారులు వ్యంగ్యంగా చూసేవారు. ముఖ్యంగా పగటి వేషాలను మతపరమైన, కులపరమైన, పౌరాణికం, జంతు ప్రదర్శన, ఇలా పలు రకాలుగా విభజించి ప్రదర్శించేవారు.

కనుమరుగయ్యే దశలో..

ప్రస్తుతం దసరాలో ఈ పండుగ సందడి కనిపించడం లేదు. గతంలో 64 వేషాలు ఉండగా, ఇప్పుడు 32కి తగ్గాయి. అవి కూడా కనుమరుగయ్యే దశలో ఉన్నాయి. ప్రస్తుతం చెప్పుకోవడానికి ఐదు, ఆరు కూడా కనిపించడం లేదు. యువత ఈ కళలను నేర్చుకోవడం లేదు. జీవన మార్పులే ఇందుకు కారణమని కళాకారులు అంటున్నారు. ఆర్థిక సమస్యలు, పట్టణాల్లో అద్దంకులు కళాకారులను ఇతర వృత్తులకు మార్చాయి.

కళను రక్షించాలి

పగటి వేషాలు కేవలం వినోదం మాత్రమే కాదు. సామాజిక దర్పణం, చారిత్రక వారసత్వం. కాబట్టి ప్రభుత్వం సాంస్కృతిక సంస్థలు, ప్రత్యేక వేదికల ద్వారా ఈ కళలను రక్షించాలి. లేకపోతే పగటి వేషాల సంప్రదాయం గ్రంథాలకే పరిమితం అవుతాయని పలువురు అంటున్నారు.

వైభవోపేతంగా మహర్నవమి



జంగారెడ్డిగూడెం: మహిషాసురమర్దనీగా ముత్యాలమ్మ



కొయ్యలగూడెం: కొలువైన దుర్గాదేవి అమ్మవారు



ద్వారకాతిరుమల: మహిషాసురమర్దనీ దేవిగా కన్యకా పరమేశ్వరి



బుట్టాయగూడెం: మహిషాసురమర్దనీగా సౌభాగ్యదేవీ

మహిషాసురమర్దనీ అలంకరణలో అమ్మవార్లు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో వేంచేసియున్న గ్రామ దేవత గంగనమ్మ దసరా ఉత్సవాలు పదో రోజు అమ్మవారు మహిషాసురమర్దనీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్, పరిమి సత్తిపండు, కొండ్రెడ్డి కిషోర్, మహంకాళి రాంబాబు, తూటికుంట రాము అమ్మవారిని దర్శించుకున్నారు. నూకాలమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్లు మహిషాసురమర్దనీగా పూజలందుకున్నారు. వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు, కనకదుర్గమ్మ, గుర్వాయిగూడెం జ్ఞానసరస్వతి అమ్మవారు మహిషాసురమర్దనీ, కాళికాదేవి అలంకారాల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు.

భక్తుల ప్రత్యేక పూజలు

లింగపాలెం: మండలంలో ధర్మాజీగూడెంలో బుధవారం కనకదుర్గమ్మ, శివాలయంలోని అమ్మవార్లను మహిషాసురమర్దనీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. శివాలయ అర్చక స్వామి అయిలూరి ఈశ్వర ప్రసాద్‌శర్మ భక్తులకు పూజలు చేసి అభిషేకాలు చేయించారు.

నేటితో ముగియనున్న ఉత్సవాలు

ద్వారకాతిరుమల: దసరా ఉత్సవాల్లో భాగంగా క్షేత్ర దేవత కుంకుళ్లమ్మ మహిషాసురమర్దనీదేవిగా బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండప ఆవరణలోని ఆలయంలో శ్రీ వాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారు మహిషాసురమర్దనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

నేడు కుంకుళ్లమ్మ రథోత్సవం

ద్వారకాతిరుమల: క్షేత్ర దేవత శ్రీకుంకుళ్లమ్మ రథోత్సవం గురువారం సాయంత్రం వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకు దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఆఖరి రోజు దసరా పండుగ నిర్వహించే ఈ రథోత్సవానికి అత్యంత ప్రాముఖ్యత ఉంది. ఈ వేడుకలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని ఆలయ ఈఓ ఎన్‌వీఎస్‌ఎన్ మూర్తి కోరారు.

మహిషాసుర మర్దిని గా కనకదుర్గమ్మ.

కొయ్యలగూడెం: దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా కనకదుర్గమ్మ బుధవారం మహిషాసురమర్దనీదేవిగా పూజలందుకున్నారు. కొయ్యలగూడెం, బయ్యన్నగూడెం, వై.జంక్షన్, వాసవీమాత ఆలయాల్లో మహిషాసురమర్దనీ రూపంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పొంగుటూరులో నూతనంగా నిర్మించిన ఆలయాలలో విజయదశమి పురస్కరించుకొని గురువారం విఘ్నేశ్వర, కనకదుర్గమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం నిర్వహించనున్నారు. మహిళలు కలశాలను ధరించి గ్రామంలో ఉత్సవ ఊరేగింపు చేశారు. కొయ్యలగూడెంలోని వాసవీమాతకు గ్రామోత్సవం నిర్వహించి సాయంత్రం నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కొలనులో తెప్పోత్సవం చేశారు.

మహిషాసురమర్దనీగా కనకదుర్గమ్మ

టి.నరసాపురం: దసరా ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు మహిషాసురమర్దనీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానంగా మండలంలోని టి.నరసాపురం, బొర్రంపాలెం, తిరుమలదేవిపేట, బండివారిగూడెం, మక్కినవారిగూడెం అమ్మవార్లకు పూజలు నిర్వహించారు.

మహిషాసురమర్దనీగా దుర్గమ్మ దర్శనం

బుట్టాయగూడెం: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పదో రోజు కనకదుర్గమ్మ మహిషాసురమర్దనీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని గుబ్బల మంగమ్మ గుడి, రెడ్డిగణపవరం, దొరమామిడి, బుట్టాయగూడెం, తదితర గ్రామాలతో పాటు చంద్రాయిగూడెం సమీపంలో సౌభాగ్య దుర్గ అమ్మవారి ఆలయంలో ఈ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

వైఎస్సార్ సీపీ నేతలకు పరామర్శ



సూర్యారావుకు నివాళులర్పిస్తున్న తెల్లం బాలరాజు

కొయ్యలగూడెం: సరిపల్లి వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ ఎంపీటీసీ మట్టా సత్యనారాయణను మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు బుధవారం ఆయన నివాసంలో పరామర్శించారు. సత్యనారాయణ బంధువు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు యార్లగడ్డ సూర్యారావు ఇటీవల మృతి చెందడంతో ఆయన చిత్రపటానికి బాలరాజు నివాళులర్పించారు. మందపాటి రామకృష్ణ, మద్దు సతీష్, మన్యం రవి, దూలపల్లి కాంతారావు, మట్టా నరసింహారావు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెట్టి గురునాథరావుతో కలిసి బాలరాజు కొయ్యలగూడెంలోని పార్టీ నాయకులు మద్దు గోపిని పరామర్శించారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

జంగారెడ్డిగూడెం: ఏజెన్సీ మెట్ట ప్రాంతాల్లో జంగారెడ్డిగూడెం లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 100 మంది పారిశుద్ధ్య కార్మికులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం నూతన దుస్తులు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట రమణ, సీఐ సుభాష్, లయన్స్ క్లబ్ నాయకులు అట్లూరు సురేష్, మద్దిపాటి నాగేశ్వరరావు, పంతగాని వెంకన్న, కన్నం హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

నాయక కులస్తుల సమస్యలు పరిష్కరించాలి

కామవరపుకోట: ఎస్టీ సర్టిఫికెట్లు ఇవ్వాలని పది రోజులుగా నాయక కులస్తులు రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని కమ్యూనిస్టు నాయకులు టీవీఎస్ రాజు అందుగుల ఫ్రాన్సిస్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నాయక కులస్తులు ఎంతో కాలంగా ఎస్టీ సర్టిఫికెట్లు తీసుకుంటున్నారని ఇప్పుడు ఆ సర్టిఫికెట్లను ఆపడం దారుణమని ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో పలువురు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యుల సమ్మె బాట

బుట్టాయగూడెం: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత రెండు రోజులుగా పీహెచ్‌సీల వైద్యులు సమ్మెబాట పట్టారు. దీంతో రోగులు అవస్థలకు గురవుతున్నారు. అయితే రోగులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా పీహెచ్‌సీలో ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌ఓలతో ఓపీ రాయిస్తూ వైద్య సేవలు అందేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. అయితే అత్యవసర సేవలు అవసరమైతే మాత్రం బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెం, ఏలూరు రిఫర్ చేసే పరిస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏజెన్సీలో 30 మంది డాక్టర్ల సమ్మె

కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలో సుమారు 15 పీహెచ్‌సీలు ఉన్నాయి. ఒక్కో పీహెచ్‌సీకి ఇద్దరు చొప్పున మొత్తం 30 మంది వైద్యులు సమ్మెబాట పట్టారు. బుట్టాయగూడెం మండలంలో పులిరామన్నగూడెం, నందాపురం, కేఆర్‌పురం, అంతర్వేదిగూడెం, దొరమామిడి పీహెచ్‌సీల్లో బుధవారం సాక్షి పరిశీలనలో ఎంఎల్‌హెచ్‌పీలు ఓపీలు రాయగా స్టాఫ్ నర్సులు వైద్య సేవలు అందించడం కనిపించింది.

సమ్మె ఉధృతం

చింతలపూడి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ) వైద్యులు చేపట్టిన సమ్మె మరింత ఉధృతమైంది. ఇన్ సర్వీస్ పీజీ కోట కుదింపుతో పాటు పలు సమస్యలపై పీహెచ్‌సీల్లో పనిచేసే వైద్యులు ఆందోళన బాట పట్టారు. దీర్ఘకాలికంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత వారం రోజులుగా నల్ల బ్యాడ్జీలు పెట్టుకుని విధులకు హాజరవుతున్న వైద్యులు ఇప్పటి వరకు ఆసుపత్రుల్లో అత్యవసర సేవలను కొనసాగిస్తూ వచ్చారు. బుధవారం నుంచి ఆసుపత్రుల్లో అత్యవసర సేవలకు హాజరు కాలేదు.వైద్యుల సమ్మెతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు బుధవారం వెలవెలబోయాయి.



ఓపీ నమోదు చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ వెంకటలక్ష్మి